సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 23 । జూన్ । 2023



వర్జీనియా 'ధర'హో

వేలంలో వర్జీనియా పొగాకు ధరలు కిలోకు రూ.267 రికార్డు స్థాయికి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

IIలో ▸



శరవేగంగా నిర్మాణం

ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలు, బోధనాస్పత్రి, హాస్టల్ భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

IIలో ▸



25న చెస్ పోటీలు

భీమవరం అనసూయ చెస్ అకాడమీలో ఈనెల 25న జిల్లాస్థాయి ర్యాపిడ్ చెస్ పోటీలు నిర్వహించనున్నారు.

IIలో ▸

రిఫైనరీ ప్లాంట్‌తో ఉపాధి

- సీఎం చేతులమీదుగా గోద్రేజ్ అగ్రోవెట్ లిమిటెడ్ యూనిట్ ప్రారంభం
- రూ.100 కోట్ల పెట్టుబడి.. 400 టన్నుల సామర్థ్యం
- 8 వేల మందికి ఉద్యోగావకాశాలు
- సుమారు 17 వేల మంది రైతులకు ప్రయోజనం

చింతలపూడి: ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని చింతంపల్లి గ్రామంలో గోద్రెజ్ అగ్రోవేట్ లిమిటెడ్ సంస్థను ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటుకు అనుమతి ఇచ్చిన తొమ్మిది నెలల్లోనే యూనిట్ ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. రూ.100 కోట్ల పెట్టుబడితో, రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో ఎడిబుల్ ఆయిల్ రిఫైనింగ్ యూనిట్, 200 టన్నుల సామర్థ్యంతో సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ యూనిట్ ప్రారంభించడం వల్ల సంస్థ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. తొమ్మిది నెలల్లోనే ప్లాంటుకు అనుమతి ఇచ్చేందుకు కృషి చేసిన అధికారులందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

ఒకేసారి 4 యూనిట్లు గొప్ప కార్యక్రమం

స్థానిక శాసనసభ్యుడు ఉన్నమట్ల ఎలీజా మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.1,425 కోట్లతో నాలుగు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు ప్రారంభించడం ఒక గొప్ప కార్యక్రమమని చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో చేసుకున్న ఒప్పందం ప్రకారం గోద్రేజ్ సంస్థ రూ.100 కోట్లతో రిఫైనింగ్ యూనిట్ ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందడం వల్ల కేవలం తొమ్మిది నెలల్లోనే ప్లాంటును ప్రారంభించినట్లు వివరించారు. ఈ ప్లాంటును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించుకోవడం చింతలపూడి రైతాంగం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే ప్లాంట్ ప్రొడక్షన్ కూడా మొదలుపెట్టాలని సంస్థ యాజమాన్యాన్ని ఆయన కోరారు. ఆయిల్‌పామ్ సాగు ఎక్కువగా ఉన్న చింతలపూడి నియోజకవర్గంలో రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రికి 2019లో ప్రచారానికి వచ్చినపుడు వివరించామని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెలంగాణ, ఆంధ్రా రైతులకు ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చడానికి రూ.82 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. రైతులకు సరిపడా ఆయిల్‌పామ్ మొక్కలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జీఎం ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఏసుదాస్, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎంపీపీ రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజ, సీతానగరం, చింతంపల్లి సర్పంచ్‌లు మల్లేశ్వరి, తాండ్ర రామకృష్ణ, గోద్రెజ్ అగ్రోవెట్ జీఎం సాజు మ్యాథ్యూ, డీజీఎం హెచ్‌ఆర్ ప్రవీణ్, డీజీఎం ఫైనాన్స్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



వర్చువల్‌గా మాట్లాడుతున్న సీఎం జగన్. చిత్రంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే ఎలీజా

200 టన్నుల సామర్థ్యంతో సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ యూనిట్

సర్పంచ్ తాండ్ర రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ రూ.100 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన ఎడిబుల్ ఆయిల్ రిఫైనింగ్ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 120 మందికి, పరోక్షంగా ఎనిమిది వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలోని దాదాపు 17 వేల మంది చుట్టుపక్కల గ్రామాల రైతులు, తెలంగాణ రాష్ట్ర రైతులు ఈ ప్లాంట్ ద్వారా తమ ముడి ఆయిల్‌పామ్‌ను రిఫైన్ చేసుకోవచ్చునని చెప్పారు. 200 టన్నుల సామర్థ్యం గల సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 60 మందికి, పరోక్షంగా 600 మందికి ఉద్యోగావకాశాలు కలుగుతాయని తెలిపారు. రాబోయే 10 సంవత్సరాల్లో ఈ ప్లాంట్ల ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.250 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

అవినీతి తిమింగలం

- స్టెనో నుంచి కమిషనర్ స్థాయికి ఎదిగిన అధికారి
- భారీగా అక్రమాస్తుల సంపాదన
- ఏసీబీ దాడులతో కలకలం
- రెండు రోజుల సోదాల్లో రూ.10 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు
- భీమవరం మున్సిపల్ కమిషనర్ అరెస్టు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: మున్సిపల్ శాఖలో ఆయన ప్రస్థానం స్టెనోగా ప్రారంభమైంది. జూనియర్ అసిస్టెంట్ నుంచి వరుసగా పదోన్నతులు పొందుతూ కొన్నేళ్ల క్రితం కమిషనర్ హోదాకు వచ్చారు. ఏకంగా ఏడు మున్సిపాల్టీల్లో పనిచేసి భారీగా గడించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులకు (ఏసీబీ) వరుస ఫిర్యాదులు రావడంతో ఆయన అక్రమ ఆస్తులపై దృష్టి పెట్టారు. తనిఖీలు, సోదాలకు రెండు రోజుల సమయం పట్టిందంటే ఆస్తుల చిట్టా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఆస్తుల విలువ రూ.10 కోట్లకుపైగానే ఉంటుందని ఏసీబీ నిర్ధారించింది. భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ అవినీతి భాగోతం ఇది. గురువారం రెండో రోజు విజయవాడలోని కమిషనర్ నివాసంలో సోదాలు కొనసాగించి రూ.8.50 లక్షల నగదు, రూ.7 లక్షల విలువైన వస్తువులను ఏసీబీ అధికారులు గుర్తించారు.



భీమవరంలో కమిషనర్ శివరామకృష్ణ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

ఏకకాలంలో తొమ్మిది చోట్ల..

భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.శివరామకృష్ణ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారని ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్, ఏసీబీ యాప్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై దృష్టి సారించిన ఏసీబీ అధికారులు బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. భీమవరంలో మూడు చోట్ల, తణుకు, పాలకొల్లు, వీరవాసరం మండలం నేలపోగు, ఉండ్రాజవరం మండలం పాలంగి, విజయవాడలోని రెండు ప్రాంతాలు, బాపట్లలో మొత్తంగా తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ డీఎస్పీ బి.శ్రీనివాస్ నేతృత్వంలో తొమ్మిది బృందాలు సోదాలు చేశాయి. ఈ క్రమంలో కమిషనర్, ఆయన కుటుంబసభ్యుల పేరుతో భారీగా ఆస్తులను గుర్తించారు.

ఎక్కువ చార్జిమెమోలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని సీడీఎంఏ విభాగంలో స్టెనోగా శివరామకృష్ణ ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టి సూపరింటెండెంట్ వరకు అక్కడే పదోన్నతులు పొందారు. కమిషనర్ హోదాలో తొలిసారిగా నూజివీడులో పనిచేశారు. అనంతరం రామచంద్రాపురం, బాపట్ల, మచిలీపట్నంలో రెండుసార్లు, పాలకొల్లు, తాడిపత్రిలో కమిషనర్‌గా పనిచేసి గతేడాది భీమవరానికి బదిలీపై వచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి ఆయన స్వగ్రామం కావడంతో భీమవరానికి బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సర్వీసులో ఎక్కువ చార్జిమెమోలు తీసుకున్నట్టుగా ఏసీబీ అధికారులు గుర్తించారు.

భారీగా ఆస్తులు

ఏసీబీ సోదాల్లో పాలంగి గ్రామంలో 3.03 ఎకరాల భూమి, భీమవరంలో జీప్లస్–1 భవనం, తణుకులో జీప్లస్–1 భవనాలు రెండు, పాలకొల్లులో జీప్లస్–1 భవనం, ఖాళీ నివాస స్థలం, విజయవాడలో రెండు అపార్ట్‌మెంట్లను శివరామకృష్ణ స్థిరాస్తులుగా గుర్తించారు. ఇక అన్ని నివాసాల్లో తనిఖీ చేసి రూ.20 లక్షల నగదు, అర కిలో బంగారం, రెండు కార్లు, ఒక ద్విచక్రవాహనాన్ని అధికారులు గుర్తించారు. గురువారం కూడా విజయవాడలోని అపార్ట్‌మెంట్‌లో సోదాలు కొనసాగాయి. విజయవాడ అపార్ట్‌మెంట్‌లో రూ.8.50 లక్షల నగదు, రూ.7 లక్షల విలువ చేసే వస్తువులను గుర్తించారు. సాయంత్రం తనిఖీలు పూర్తి చేసిన ఏసీబీ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు. గతంలో కూడా శివరామకృష్ణపై రెండుసార్లు ఏసీబీ దాడులు జరిగాయి. ఈసారి పక్కా సమాచారంతో సోదాలు నిర్వహించడంతో భారీగా ఆస్తులు గుర్తించారు.

విద్యా వ్యాపారాన్ని సహించం

ప్రైవేట్ స్కూళ్లకు డీఈఓ హెచ్చరిక



ఓ స్కూల్‌లో అమ్మకానికి సిద్ధం చేసిన పుస్తకాలు

సాక్షి, భీమవరం: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా సామగ్రి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి ఎక్కడైన విద్యా సామగ్రి విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను అదే ధరకు విద్యార్థులకు విక్రయించాలనే, అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రైవేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా పాఠ్యపుస్తకాలతోసహా నోట్ పుస్తకాలు, యూనిఫాం, డ్రెస్ మెటీరియల్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భీమవరంలోని ఒక విద్యాసంస్థలో విద్యా సామగ్రి అక్రమంగా విక్రయిస్తుండగా ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. దీనిపై విద్యాశాఖకు ఫిర్యాదు చేయడంతో స్కూల్‌ను తనిఖీ చేసి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు, పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పక్కాగా 'జగనన్న సురక్ష'

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి గురువారం ఆమె జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి కార్యక్రమ విధివిధానాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించాలన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవసరమైన సర్వీసులను నమోదు చేసుకుని సిద్ధంగా ఉంచాలన్నారు. జగనన్న సురక్షపై విస్తృత ప్రచారం చేయాలని, సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల్లో 11 సర్వీసులకు ఎలాంటి సర్వీసు చార్జీలు ఉండవని తెలిపారు. నాలుగు వారాల పాటు జగనన్న సురక్ష నిర్వహిస్తారని, క్యాంపుల్లో కుల, నివాస, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భూకొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు, ఆన్‌లైన్‌లో భూవివరాల నమోదులో మార్పులు చేర్పులు, వివాహ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాలలో పేర్ల తొలగింపు వంటి సర్వీసులు అందిస్తామన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు కృషిచేయాలన్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

- జగనన్న సురక్ష కార్యక్రమం
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజాసమస్యలను నూరుశాతం పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. వలంటీరు, గృహసారథులు, కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. పథకాలపై ఆరా తీసి లోటుపాట్లను నమోదు చేసుకోవాలన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. తెలుసుకున్న సమస్యలను పరిష్కరించేందుకు వారం తర్వాత సచివాలయంలో శిబిరం నిర్వహిస్తారన్నారు. సమస్య ఉందని ఎవరూ చెప్పే పరిస్థితి భవిష్యత్తులో ఉండకూడదన్నారు. నెల రోజులపాటు జగనన్న సురక్ష కొనసాగుతుందని, పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని సూచించారు. బాధ్యతతో శ్రద్ధగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఆర్బీఐ నివేదిక ప్రకారం జీఎస్డీపీలో రాష్ట్రం 22 నుంచి 3వ స్థానానికి ఎగబాకిందని, తలసరి ఆదాయంలో 17వ స్థానం నుంచి 8వ స్థానానికి వచ్చిందన్నారు. గ్లోబర్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ద్వారా రూ.13.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు సాధించగలిగామన్నారు. రాష్ట్రం వ్యవసాయంలో 27వ స్థానం నుంచి 6వ స్థానానికి, విద్యారంగంలో 24వ స్థానం నుంచి 5 స్థానానికి ఎదిగిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని శ్రేణులకు మంత్రి కొట్టు పిలుపునిచ్చారు. నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, మైలవరపు పెదబాబు, కైగాల శ్రీనివాసరావు, వెలిశెట్టి నరేంద్ర, సూర్పని రామకృష్ణ, రెడ్డి సూరిబాబు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఫ్రాన్సిక కుటుంబానికి ప్రభుత్వం అండ

ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్

ఏలూరు (టూటౌన్): యాసిడ్ దాడికి గురై మృతిచెందిన ఎడ్ల ఫ్రాన్సిక కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని, దోషులను కఠినంగా శిక్షించేలా అధికారులు పనిచేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. ఏలూరు విద్యానగర్‌లో నివాసముంటున్న మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. బాధితురాలి కుటుంబానికి ఆర్థిక సహాకారాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. మృతురాలి నాలుగేళ్ల కుమార్తె పోషణ నిమిత్తం చిన్నారి మేజర్ అయ్యేంత వరకూ నెలకు రూ.5 వేలను అందిస్తామన్నారు. ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదైనందున ఎఫ్ఐఆర్ మొదటి విడతగా రూ.4,12,500ను రెండు రోజుల్లో ఖాతాలో జమచేస్తారన్నారు. ఫ్రాన్సికకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం జగన్ రూ.20 లక్షలు మంజూరు చేశారని, ఇది దళితులపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. దురదృష్టవశాత్తు 8 రోజుల తర్వాత ఫ్రాన్సిక మరణించడం బాధాకరమని, ఇటువంటి ఘటనలు పునారావృతం కాకుండా చూడాలని, రాజకీయం చేయకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు.

నిందితుల అరెస్టు : డీఎస్పీ ఈ.శ్రీనివాసరావు మాట్లాడుతూ దిశా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, ముగ్గురు నిందితులతో పాటు యాసిడ్ విషయంలో సహకరించిన వారిని అరెస్ట్ చేశామన్నారు. తహసీల్దార్ సోమశేఖర్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు మాట్లాడుతూ బాధితురాలికి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం తక్షణ ఆదేశాలు ఇచ్చిందన్నారు. బాధితురాలి కుటుంబసభ్యులకు బియ్యం, ఆహార దినుసులు అందజేశారు. 24వ డివిజన్ కార్పొరేటర్ నిర్మల, కో–ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ గురునాథ్, దళిత సంఘాల నాయకులు మేతర అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.187 కోట్ల పరిహారం

వైఎస్ జగన్ మనసున్న సీఎం అని ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. 2019 నుంచి ఇప్పటివరకూ అట్రాసిటీ కేసుల్లో రూ.187 కోట్లను పరిహారం కింద అందించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అట్రాసిటీ కేసులు నమోదు చేసేవారు కాదని.. ఒకవేళ నమోదు చేసినా ఎటువంటి పరిహారం ఇచ్చేవారు కాదని విమర్శించారు.



ఏలూరులో ఫ్రాన్సిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనందప్రకాష్

నేడు విద్యుత్ పరిష్కార వేదిక

గణపవరం: గణపవరం ఏడీఏ కార్యాలయం వద్ద శుక్రవారం గణపవరం, నిడమర్రు, అత్తిలి మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు తాడేపల్లిగూడెం ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యుత్ పొదుపు, వినియోగ సమస్యలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ పాల్గొంటారని, విద్యుత్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహిస్తామన్నారు. సభ్యులు ఎస్.సురేష్‌బాబు, ఎస్.హరిబాబు, ఆర్.సురేంద్రకుమార్ కూడా హాజరవుతారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేదికకు హాజరై సమస్యలకు పరిష్కారం పొందవచ్చని సూచించారు.

న్యూస్‌రీల్

మోదీతోనే దేశాభివృద్ధి



పాలకొల్లులో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్

పాలకొల్లు సెంట్రల్: కరోనాతో ప్రపంచ దేశాలు ఆర్థికంగా వెనుకబడిపోయాయని, భారతదేశం మాత్రం ఆర్థికంగా నిలదొక్కుకుందంటే అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమైందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ అన్నారు. గురువారం పాలకొల్లులో మహాజన సంపర్క్ అభియాన్ బహిరంగ సభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కరోనా సమయంలో వ్యాక్సిన్లను ఉచితంగా పంపిణీ చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో గుజరాత్ మాదిరిగా 900 కిలోమీటర్ల కోస్టల్ కారిడార్ నిర్మాణం చేశారన్నారు. రైల్వేకు 8.16 లక్షల కోట్లు కేటాయిస్తే ఏపీకి రూ.65 వేల కోట్లు కేటాయించారన్నారు. ఎయిర్‌పోర్టులను కేంద్రం అభివృద్ధి చేసిందన్నారు. బీజేపీ నాయకులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ, పాకా సత్యనారాయణ, యర్రంశెట్టి పద్మారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు సన్మానం చేయడానికి సిద్ధమవ్వగా వీర్రాజు సన్మానం చేయించుకోకుండా స్టేజీ దిగివెళ్లిపోయారు. మంత్రికి సన్మానం చేసి ఆమె కిందకు వెళ్లగా వీర్రాజు వెనక్కి వచ్చారు. ఇలా ఎందుకు చేశారో ఎవరికీ అర్థం కాలేదు. అలాగే పార్టీ ఈసీ మెంబర్‌గా పనిచేసిన, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన రావూరి సుధని సమావేశానికే పిలవకపోవడం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేసింది.

నాడు–నేడుపై సమీక్ష

సాక్షి, భీమవరం: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు బడుల ఆవరణలను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మనబడి నాడు–నేడు పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. పాఠశాల ఆవరణల్లో మొక్కలు పెంచాలని, మురుగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నాడు–నేడు పనులను పకడ్బందీగా నిర్వహించాలని నిర్లక్ష్యం వహిస్తే సహించమని హెచ్చరించారు. జగనన్న విద్యా కానుక కిట్లను నూరుశాతం పంపిణీ చేయాలన్నారు. నూతనంగా నియమితులైన మండల విద్యాధికారులు వారంలో నాలుగు పాఠశాలలను తనిఖీ లోటుపాట్లపై నివేదికను అందజేయాలని ఆదేశించారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, ఎస్ఎస్ఏ పీఓ పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

కార్గో ఆదాయం పెంపునకు కృషి



మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

జంగారెడ్డిగూడెం: కార్గో ఆదాయాన్ని పెంచడానికి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఏలూరు ఏటీఎం (కమర్షియల్) జీఎల్‌పీవీ సుబ్బారావు అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో కార్గో సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. సిబ్బందికి కార్గో పెర్ఫార్మెన్స్ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ కార్గో ద్వారా అతి తక్కువ సమయంలో, అతి తక్కువ ధరతో సరుకు రవాణా చేస్తుందన్నారు. 84 ప్రాంతాల్లో కార్గో డోర్ డెలివరీ సదుపాయం ఉందన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి చర్యలు : జేసీ

ఏలూరు(మెట్రో): పౌష్టికాహార లోపాలను అధిగమించేందుకు వచ్చేనెల 1 నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకున్నామని ఏలూరు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 6.5 లక్షల కార్డుదారులకు 9,500 టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తామన్నారు. మెరుగైన ఆరోగ్యం కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తామని, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, 7–72 నెలల వయసున్న చిన్నారులు, ప్రధాన మంత్రి పోషణ, జగనన్న గోరుముద్ద ద్వారా బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి క్వింటాల్ బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను ప్రత్యేక యంత్రాలు ద్వారా కలిపి తయారుచేసిన మొత్తం బియ్యాన్ని రైస్ మిల్లుల ద్వారా సేకరిస్తామన్నారు. జిల్లాలోని సంక్షేమ సంస్థలు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తామన్నారు.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

చింతలపూడి: మహిళ హత్యకేసులో నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు చింతలపూడి సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన సుశాంత్ ముఖర్జీ తన వదిన అర్చన ముఖర్జీతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని, అక్కడి నుంచి వచ్చి మండలంలోని సీతానగరంలో ఉంటున్నాడు. సుశాంత్ ముఖర్జీ పామాయిల్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. అయితే అర్చన ముఖర్జీ గ్రామంలోని ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందన్న విషయం తెలుసుకున్న సుశాంత్ ముఖర్జీ ఈ నెల 3న అర్చన మెడకు చీరను గట్టిగా బిగించి హత్య చేశాడు. మృతదేహాన్ని ఇంటి బాత్రూమ్‌లో వేసి, అక్కడ నుంచి సత్తుపల్లి, విజయవాడకు వెళ్లి, రైల్లో పశ్చిమ బెంగాల్ పారిపోయాడన్నారు. ఈ క్రమంలో నిందితుడు సుశాంత్ ముఖర్జీని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

శరవేగంగా వైద్య కళాశాల నిర్మాణం



ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో రిలయన్స్ ట్రెండ్స్ వెనుక మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు



ఎంసీహెచ్ బ్లాక్‌లో తాత్కాలికంగా హాస్టల్ ఏర్పాటు

- యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల ఏర్పాటు
- రూ.60 కోట్లతో నిర్మాణ పనులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా వాసుల చిరకాల కోరిక నెరవేరబోతుంది.. దశాబ్దాల కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే ఆళ్ళనాని సారధ్యంలో నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభం కాబోతుంది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే అనుమతులు ఇవ్వడంతోపాటు, త్వరలో 150 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అకడమిక్ ఇయర్‌లో ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు జరుగుతుండగా, ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ దానిలో ఒకటి. ఒకవైపు సీట్లు భర్తీ ప్రక్రియ ప్రారంభమయ్యే రోజులు దగ్గరపడుతుండగా మరోవైపు మెడికల్ కాలేజీ భవనాలు, బోధనాసుపత్రి, హాస్టల్ భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన భవన నిర్మాణాలు

ఏలూరు జిల్లాకే ప్రతిష్టాత్మకంగా నగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇక భవనాల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. రాత్రింబవళ్ళు పనులు చేస్తూ భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వ అధికారులు పని చేస్తున్నారు. మరోవైపు కాంట్రాక్ట్ సంస్థ మేఘా ఇంజనీరింగ్ పనులను శరవేగంగా చేపడుతోంది. ఏలూరు జీజీహెచ్ ప్రాంగణం ముందు భాగంలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణం చేపడుతున్నారు. సుమారు 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 4 భవన నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం సుమారుగా రూ.75 కోట్లు వెచ్చిస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 2 భవన నిర్మాణం పనులు చివరి దశలో ఉన్నాయి. భవనం నిర్మాణం పూర్తి కాగా తుది మెరుగులు దిద్దుకుంటోంది. జీజీహెచ్ ప్రాంగణంలోనే బాలురు, బాలికలకు వేర్వేరుగా తాత్కాలికంగా హాస్టల్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎంసీహెచ్ బ్లాక్ భవనం పై అంతస్తు నిర్మాణం చేపట్టారు. దీనిలో హాస్టల్ సదుపాయాన్ని కల్పించేలా వేగంగా పనులు సాగుతున్నాయి. జీజీహెచ్ ప్రాంగణంలోనే కొత్తగా బోధనాసుపత్రిని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సదుపాయాల కల్పనకు కృషి



ఏలూరు నగరంలో నూతనంగా ప్రారంభం కాబోతున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుసంధానంగా బోధనాసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే బోధనాసుపత్రిని ఆధునీకీకరణ చేయడంతో పాటు, పూర్తిస్థాయిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యులు నియామకం చేపట్టారు. విద్యార్థులకు హాస్టల్ సదుపాయాన్ని కల్పించేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో రెండేళ్ళలో పూర్తిస్థాయి సౌకర్యాలు, ఆధునిక వైద్యసేవలు, చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి.

– డాక్టర్ కేవీవీ విజయకుమార్, బోధనాసుపత్రి సూపరింటెండెంట్, ఏలూరు

ఏలూరు ఎమ్మెల్యే కృషి ఫలితం



ఏలూరు జిల్లా వాసుల చిరకాల కోరిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు కావడం ఎమ్మెల్యే ఆళ్ళనాని కృషి ఫలితమే. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రి రావటంతో ప్రజలకు ఆధునిక వైద్య చికిత్సలు, సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలు ఆధునిక వైద్యానికి దూరప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ప్రభుత్వ మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేయగా.. కేవలం మూడేళ్ళ కాలంలోనే మెడికల్ కాలేజీ మంజూరు చేయించడం అభినందనీయం.

– పిల్లంగోళ్ళ శ్రీదేవి, కార్పొరేటర్, 7వ డివిజన్, ఏలూరు

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



రాష్ట్రంలో పేదలకు మేలు జరుగుతుంది అంటే కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యం. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదటి దశలోనే ఐదు మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇచ్చారు. ఏలూరు మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కావడం ఎమ్మెల్యే ఆళ్ళనాని కృషి, పట్టుదలే కారణం. గత టీడీపీ హయాంలో హడావుడి తప్ప చేసిందేమీ లేదు.

– రియాజ్ ఆలీఖాన్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నేత

దేవదాయ శాఖ ఉద్యోగుల విధులపై సర్క్యులర్

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలతో పాటు, 6ఏ ఆలయాల్లో పని చేసే రికార్డు అసిస్టెంట్ నుంచి ఏఈఓ స్థాయి వరకు ఉద్యోగులకు రొటేషన్ పద్ధతిలో విధులను కేటాయిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. ఉద్యోగులు ఒకే సంస్థలో ఒకే చోట ఏళ్ల తరబడి పాతుకుపోవడం వల్ల పలు ఆరోపణలు వస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఇంజినీరింగ్ సిబ్బందిని మినహాయించి, ఏఈఓలు, సూపరింటెండెంట్‌లు, సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్లను ప్రతి 3 నెలలకు ఒకసారి రొటేషన్ పద్ధతిన విధులు మార్పు చేయాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. 4వ తరగతి ఉద్యోగులు, కౌంటర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి సైతం ఇదే పద్ధతి వర్తిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్, లీగల్ విభాగ సిబ్బందిని, అకౌంట్స్, లీజియస్ చూసే సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను పరిపాలనా సౌలభ్యం ఆధారంగా కాల వ్యవధిలో రొటేట్ చేయాలని పేర్కొన్నారు. ఇకపై ప్రతీ మూడు నెలలకోసారి ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం ఉద్యోగుల విధుల్లో మార్పులు జరగనున్నాయి.

డీఈఎల్ ఈడీ పరీక్షలకు 165 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షలకు 148 మంది అభ్యర్థులకు 148 మంది హాజరయ్యారు. మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 68 మందికి 17 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

వరాహావతారంలో జగన్నాథుడు



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో జగన్నాథుడు గురువారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా శంఖు, చక్రాలను ధరించి, విశేష పుష్పాలంకారాల్లో ఉన్న స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పుట్టింటికి తీసుకెళ్లలేదని భార్య ఆత్మహత్య

ఉండి: పుట్టింటికి తీసుకువెళ్లలేదంటూ భర్తపై అలిగిన భార్య గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా పెదబయలు మండలం సింగవలస గ్రామానికి చెందిన వంచుర్ల రమేష్ ఆయన భార్య కుమారి(19) ఉండి మండలం కలిగొట్ల గ్రామంలోని ఓ ఆక్వా చెరువు వద్ద సుమారు 2 నెలల నుంచి పనిచేస్తున్నారు. వీరికి వివాహమై సుమారు 7 నెలలు కావస్తుంది. తరచుగా తనను పుట్టింటికి తీసుకువెళ్లాలంటూ భర్తను అడిగేది. ఇదేక్రమంలో బుధవారం తనను పుట్టింటికి తీసుకువెళ్లాలంటూ భర్తను అడగడంతో అతను తీసుకువెళ్లలేదు. భర్తపై అలిగిన భార్య తమ వద్దనే ఉన్న గడ్డిమందును తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో హుటాహుటీన భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గురువారం ఆసుపత్రిలోనే ఆమె కన్నుమూసింది. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు, భర్త ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కే.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25న జిల్లా స్థాయి ర్యాపిడ్ చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న భీమవరం పట్టణంలోని అనుసూయ చెస్ అకాడమీలో జిల్లా స్థాయి ర్యాపిడ్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించే పోటీల్లో విజేతలు జూలై 22, 23 తేదీలో భీమవరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ చెస్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాల కోసం 90632 24466 నెంబరులో సంప్రదించాలన్నారు.

టిప్పర్ లారీల సీజ్

నూజివీడు: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్ లారీలను రూరల్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలం ఏపూరు నుంచి మర్రిబంధంకు టిప్పర్ లారీల్లో పెద్ద ఎత్తున మట్టిని అనుమతులు లేకుండా తోలుతున్నారనే సమాచారం మేరకు దాడి చేశారు. టిప్పర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, డ్రైవర్లపై కేసు నమోదు చేయడమే కాకుండా లారీలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

49.65 క్వింటాళ్ల ధాన్యం సీజ్



పెన్నాడలో ధాన్యాన్ని సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ధాన్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం దాడి చేసి పట్టుకున్నారు. జిల్లా విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ గురువారం పెన్నాడలోని ఒక గోదాంపై దాడి చేశారు. నక్కా రామచంద్రరావు నిల్వ చేసిన 49.65 క్వింటాళ్ల స్వర్ణ, ఇతర రకాల ధాన్యం విత్తనాలను సీజ్ చేశారు. దీని విలువ రూ.1.86 లక్షలు వుంటుందని అధికారులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తండ్రి కనిపించడం లేదని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. విస్సాకోడేరు పంచాయతీ పరిధిలోని వంకాయలపాలెం గ్రామానికి చెందిన నాయుడు పెంటయ్య (50) ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో కుమారుడు మావుళ్ల పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని గాయపర్చిన కొడుకుపై కేసు

టి.నరసాపురం : తల్లిని గాయపర్చిన నేరంపై కొడుకుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొర్రంపాలెం గ్రామానికి చెందిన పడమట ఆంజనేయులు తాను అడిగినప్పుడు సొమ్ములు ఇవ్వలేదని తల్లి సుబ్బాయమ్మను వేధిస్తున్నాడు. సుబ్బాయమ్మకు వస్తున్న పెన్షన్, డ్వాక్రా సొమ్ములు ఖర్చులకు అడిగినప్పుడు ఇవ్వాలంటూ, ఈ నెల 14వ తేదీన కొబ్బరి మట్టతో సుబ్బాయమ్మను కొట్టాడు. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కాగా, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అ'ధర'గొట్టిన వర్జీనియా



కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో పొగాకు బేళ్లకు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : వేలంలో వర్జీనియా పొగాకు ధరలు రికార్డు స్థాయికి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వేలం కేంద్రంలో పొగాకు ధర రూ.267కి చేరుకోగా అత్యల్పంగా రూ.175 పలికింది. వేలం ప్రారంభ తేదీ నుంచి ఇంతవరకు 71 రోజులు పొగాకు కొనుగోళ్లు నిర్వహించినట్లు వేలం నిర్వహణ అధికారి గ్రేసీ మార్గరెట్ తెలిపారు. మొత్తం ఇంతవరకు 20 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయని చెప్పారు. మొత్తం 6.03 మిలియన్ల కేజీల పొగాకును కొనుగోలు చేశారు. సరాసరి ధర రూ. 207గా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు ముున్ముందు ధర పెరిగే అవకాశం ఉందని భావిస్తూ పొగాకు నిల్వ చేసి ఉంచుకుంటున్నారన్నారు. అయితే సాధ్యమైనంత త్వరగా వారికి ఇచ్చిన పరిమితి మేరకు పొగాకును వేలం కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించుకోవాలన్నారు. లో గ్రేడ్‌కి సైతం మద్దతు ధర వస్తుండడంతో రైతులు వెంటనే తమకు ఇచ్చిన అనుమతుల మేరకు పొగాకు విక్రయిస్తున్నారు. పొగాకు ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రగామి బ్రెజిల్‌తో పోటీ పడ్డామని వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాలలో నాణ్యమైన పొగాకు సరాసరి బ్రెజిల్ మార్కెట్‌తో సరితూగిందన్నారు.

పోటీపడి కొంటున్న కంపెనీలు



ప్రస్తుతం కంపెనీలు పోటీపడడంతో రైతుకు ఇస్తున్న మద్దతు ధరతో రైతులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుల వద్ద మిగిలి ఉన్న పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యే వరకు సరాసరి ఇదే మద్దతు ధర ఉంటే వర్జీనియా పొగాకు రైతుకి మంచి రోజులు వచ్చినట్లే.

– గ్రేసీ మార్గరెట్, వేలం నిర్వహణాధికారి, కొయ్యలగూడెం వేలం కేంద్రం

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం 25వ వార్డులో లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పాలకొల్లు అర్బన్ : మండలంలోని పూలపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పథకాల ప్రయోజనాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

చోరీకి విఫల యత్నం



పెన్నాడలో ఇంట్లోకి చొరబడిన వ్యక్తిని స్తంభాన్ని కట్టేసిన దృశ్యం

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి ఒక ఇంట్లోకి చొరబడి దొంగతనం చేయడానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డాడు. గ్రామానికి చెందిన శిడగం వినాయకరావు ఇంట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయం 11 గంటల సమయంలో వినాయకరావు భార్య హైమావతి తమ పిల్లల స్కూల్ ఫీజు చెల్లించేందుకు ఇంటికి గడియ పెట్టి విస్సాకోడేరు వెళ్లింది. ఇది గమనించిన దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి, బీరువా పగలగొట్టి చోరీకి ప్రయత్నించాడు. అప్పుడే ఇంటికి వచ్చిన వినాయకరావు దంపతులు తలుపు తెరిచి ఉండడాన్ని గమనించి హడావుడిగా లోనికివెళ్లారు. బీరువాలో వస్తువులు చెల్లా చెదురుగా విసిరేసిన దుండగుడు వారిని చూసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. వినాయకరావు దుండగుడిని అడ్డుకుని స్థానికుల సహాయంతో ఇంటి ఆవరణలోని స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. గత వారం రోజులుగా దుండగులు పెన్నాడ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై ఇంకా ఎలాంటి కేసు నమోదు చేయలేదని పాలకోడేరు ఎస్సై వెల్లడించారు.

రూ.3 కోట్ల మేర మోసగించిన బ్యాంక్ ఉద్యోగి



బ్యాంక్ ఉద్యోగి మోసంపై ఎమ్మెల్యే ఎలీజా, కలెక్టర్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

లింగపాలెం: తమకు అధిక వడ్డీ ఇస్తానంటూ నమ్మించి రూ.3 కోట్లు తీసుకొని పరారయ్యాడంటూ బాధితులు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వద్ద లబోదిబోమన్నారు. ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన పలువురు బాధితులు గురువారం చింతలపూడిలో ఎమ్మెల్యే ఎలీజా, కలెక్టర్ వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితుల వివరాలు ప్రకారం.. ధర్మాజీగూడెంలో కొంత కాలంగా ఉంటూ స్థానిక ఎస్‌బీఐలో ఉద్యోగిగా పనిచేసిన బి.బాబురావు తమకు అధిక వడ్డీ ఆశచూపి రూ.3 కోట్లు తీసుకొని మోసం చేశాడంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 92 మంది వద్ద డబ్బులు తీసుకొని పరారయ్యాడని తెలిపారు. బాబురావు కొంత కాలం క్రితం లింగపాలెం ఎస్‌బీఐ బ్యాంక్‌కు బదిలీపై వెళ్లాడు. బాధితులు డబ్బులు ఇవ్వమని అడగగా అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తుండటంతో బాధితులందరూ.. ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే చర్యలు చేపడతామని కలెక్టర్, ఎమ్మెల్యే తెలిపినట్లు బాధితులు తెలిపారు.

నేడు, రేపు స్కిల్ టెస్ట్, డెమో తరగతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లోని ఖాళీ పోస్టుల భర్తీకి 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను గురువారం సమగ్రశిక్ష అధికారులు పరిశీలించారు. ఎంపికయిన 28 మంది అభ్యర్థులంతా విధిగా స్కిల్ టెస్ట్, మోడల్ డెమో తరగతులకు ఈ నెల 23, 24 తేదీల్లో హాజరు కావాలన్నారు. సీఆర్‌టీ పోస్టుకు ఏలూరులోని రామకోటి వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో, పీజీటీ పోస్టుకు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే స్కిల్ టెస్ట్, డెమో తరగతులకు అభ్యర్థులు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు. హాజరుకాని అభ్యర్థుల పేర్లను తుది ఎంపిక జాబితాలో చేర్చబడవని పేర్కొన్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

టి.నరసాపురం : మైనర్ బాలిక, ఆమె తల్లిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలదేవిపేటకు చెందిన ఒక మహిళను ఆమె భర్త లేని సమయంలో అదే గ్రామానికి చెందిన చిలకా రాజా, రాయల అంజి మహిళ ఇంటిలోకి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. ఆమె చేయి పట్టుకోవడమే కాకుండా మైనర్ అయిన మహిళ కుమార్తె పట్ల కూడా వారు అసభ్యకరంగా ప్రవర్తించారని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- 25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం 25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజలకు అందిన పథకాలు చదివి వినిపిస్తుంటే వారి ముఖాల్లో సంతోషం కన్పిస్తోందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక 25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలను వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు మోసం చేసి అధికారంలోకి వచ్చేందుకు తెదేపా, జనసేన పార్టీలు జగన్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దని తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న జగన్ ప్రభుత్వానికి రెండోసారి అధికారం ఇస్తే ఇంతకు మించి మేలు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. చంద్రబాబు హయాంలో గజం స్థలం ఇచ్చిన దాఖలాలు లేవని మంత్రి ఆరోపించారు. అదేవిధంగా ఆయా శాఖల అధికారులు ప్రజలకు సదుపాయాలు కల్పించేందుకు తమవంతు బాధ్యత నిర్వహించాలన్నారు. గృహాలు నిర్మించుకొనేవారికి త్వరితగతిన స్థలాలను అందచేయాలని సూచనలు చేశారు. అసవరమైన వారికి డ్వాక్రా గ్రూపుల ద్వారా రూ. 35వేలు రుణ సదుపాయాన్ని అందించేందుకు మెప్మా సహకరించాలని తెలిపారు. పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందస్తున్న అమ్మఒడి, విద్యాకానుక, విద్యావసతి తదితర పథకాలను సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, నాయకులు కె అశోక్, యజ్జల రాంబాబు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, వట్టి బుజ్జి, మిద్దే ఆదినారాయణ, దాసి బాబు, చింతా శ్రీనివాస్, చామన సూర్యచంద్రరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి విశేష పూజలు



లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో గురువారం ఆషాడ మాసం చవితి పురస్కరించుకొని లక్ష్మీ గణపతి స్వామి వారికి పంచామృతాలతో, ఫలరసాలు, సుగంధ ద్రావ్యాలతో విశేషంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశయ్య, ఆలయ కార్యదర్శి కె.శ్యామ్ తదితరులు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

30లోగా పాన్‌కార్డుకి ఆధార్ లింక్ చేయించుకోవాలి

అత్తిలి: పాన్‌కార్డుకి ఆధార్‌కార్డు లింక్ చేసుకోవడానికి వెయ్యి రూపాయల అపరాధ రుసుంతో ఈనెలాఖరు వరకు గడువు ఉందని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ అత్తిలి మండల అధ్యక్షుడు పమ్మి గోపాలకృష్ణమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులందరూ వారి జీవిత భాగస్వాములు తప్పనిసరిగా నెట్ సెంటర్‌కు వెళ్లి లింక్ చేసుకోవాలని చెప్పారు. పాన్‌కార్డుకి ఆధార్ లింక్ చేసుకోనివారి పాన్‌కార్డు రదుద చేస్తారని, పాన్‌కార్డు కలిగిన ప్రతి వ్యక్తి ఆధార్‌కార్డుకి లింక్ చేసుకోవాలని తెలిపారు.

డాక్టర్ స్వర్ణలతకు అంతర్జాతీయ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న డాక్టర్ స్వర్ణలత

పాలకోడేరు: అమెరికాలోని డాక్టర్ రామకృష్ణ సాహె ప్రెసిడెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ అమెరికా, చికాగో, మనం ఫౌండేషన్ అధినేత డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లోని బిర్లా మందిర్‌లో గౌరవ డాక్టరేట్ అవార్డు, గౌతమ బుద్ధ సర్వీస్ అవార్డు అందుకున్నారు. భారతదేశంలో సామాజిక సేవ చేస్తూ, దేశంపై ప్రేమ, మానవత్వం, శాంతియుత, మానవ హక్కుల కోసం కృషి చేస్తున్న వారికి ఈ అవార్డులు ఇస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలతకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ఉపాధ్యాయుడు విజయకుమార్ సేవలు అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు ప్రశంసించారు. మైప గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు విజయకుమార్‌కు బదిలీ అయిన సందర్భంగా పాఠశాలలో గురువారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు పనిచేసి విద్యార్థులకు చక్కటి బోధన అందించారన్నారు. అనంతరం విజయకుమార్‌ను, హెచ్ఎం గోపిమూర్తిని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ గొట్టుముక్కల జయంతి తిరుపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు తంగెళ్ల మంజుల ఆనందరాజు, సచివాలయ కార్యదర్శి సాయి, వనజ గ్రామస్తులు పాల్గొన్నారు.

వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారావు

కాళ్ల: ప్రభుత్వం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమం విధివిధానాలపై కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీఓ జి.స్వాతి, వ్యవసాయశాఖ ఆకివీడు ఏడీఏ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాటర్ టాక్స్, రీసర్వే, కౌలు రైతు కార్డుల తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తండ్రి కనిపించడం లేదని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. విస్సాకోడేరు పంచాయతీ పరిధిలోని వంకాయలపాలెం గ్రామానికి చెందిన నాయుడు పెంటయ్య (50) ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో కుమారుడు మావుళ్ల పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ఐదుగురిపై కేసు

ఆకివీడు: పాత గొడవలను పురస్కరించుకుని వ్యక్తిపై దాడి చేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దుంపగడప గ్రామానికి చెందిన తిరుమాని శ్రీనివాసరావుపై అదే గ్రామం పల్లిపాలెంకు చెందిన బొడ్డు ప్రసాదు, బొడ్డు గణేష్, తిరుమాని మణికంఠ, తిరుమాని కిషోర్, బొడ్డు మహేష్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయాలతో ఉన్న శ్రీనివాసరావును ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊపందుకున్న ఖరీఫ్ వరినాట్లు



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం గ్రామంలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ వరి నాట్లు తాడేపల్లిగూడెం మండలంలో ఊపందుకున్నాయి. మండలంలో మొత్తం 26వేల 512 ఎకరాల్లో వరి నాట్లు పడవలసి ఉంది. ఇందుకు గాను 540 హెక్టార్లల్లో వరి నారు అవసరం ఉంది. ప్రస్తుతం 493 హెక్టార్లల్లో నారు పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా పీఆర్-126, ఎస్ఎల్10 రకాలను అధికారులు సిఫార్స్ చేస్తున్నారు. వీటి కాలపరిమితి 120 రోజులు. తెగుళ్ల కూడా తక్కువ కావడంతో ఈ రకం వరి వంగడాలపై రైతులు సైతం మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, మోదుగ గుంట, అప్పారావుపేట, గొల్లగూడెం తదితర గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దాదాపు 472 హెక్టార్లల్లో నాట్లు పూర్తయ్యాయి. ఇదిలా ఉంటే ఆలస్యంగా కోతలు పూర్తయిన గ్రామాల్లో ఇప్పుడిప్పుడే నారుమడి పోస్తున్నారు. జులై రెండు, మూడు వారాల నాటికి ఈ గ్రామాలతో పాటు కాలువ ఆయకట్టు గ్రామాల్లో నాట్లు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రైతులు నారుమడి పోసుకోవాలి



కాలువ ఆయకట్టు ప్రాంతాల్లోని రైతులు త్వరితగతిన నారుమడి పోసుకోవాలి. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. రైతులు బుక్ చేసుకున్న నిర్ణీత సమయంలో వాటిని అందించడం జరుగుతుంది.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

ప్రైవేట్ ఆసుపత్రిలో అధికారుల తనిఖీలు

తణుకు: పట్టణానికి చెందిన ప్రైవేటు ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన రాధాకృష్ణ న్యూరో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో పలు రికార్డులు తనిఖీ చేసారు. తమ ఆసుపత్రికి తీసుకువచ్చే రోగులను సంబంధించి పీఎంపీలకు 30శాతం కమిషన్ ఇస్తామంటూ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి మహేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ కమిటీ సభ్యులు ఆసుపత్రిని సందర్శించి వైద్యులు కార్తీక్ ఈశ్వర్‌ను విచారించారు. ఈ సంఘటపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రనాయకులు సైతం వివరణ కోరారు. బహిరంగంగా పీఎంపీలకు కమీషన్ ఇస్తామని ప్రకటించడం చట్టరీత్యానేరమని అధికారుల పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ చేసి, నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు. ఇదిఇలా ఉంటే ఇదే ఆసుపత్రికి సంబంధించి డ్రగ్ లైసెన్సు లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్నారని ఆరోపణలు నేపథ్యంలో ఇటీవల ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే.

నెలాఖరు నాటికి నారుమడులు వేసుకోవాలి

కాళ్ల: మండలంలో రైతులు జూన్ నెలాఖరు నాటికి నారుమడులు వేసుకోవాలని వ్యవసాయశాఖాధికారి జయవాసుకి కోరారు. కాళ్ల వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో 4,316 ఎకరాల్లో వరి సార్వా సాగు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో సుమారు 216 ఎకరాలలో నారుమడులు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారన్నారు. జక్కరం, బొండాడ, కోపల్లె, సీసలి గ్రామల్లో ఇప్పటికే నారుమడులు వేశారన్నారు. జూన్‌లో ఎంటీయూ 1,318 రకం వరి వంగడాలను నారుమడులుగా వేసుకోవాలని, నారముడులు వేయడంలో ఆలస్యం అయితే ఎంటీయు 1064, 1061 రకాల వరి వంగడాలను వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గత ఏడాది 1470 మంది కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు అందించామన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రంలో వేలిముద్రలు (బయోమెట్రిక్) వేయాలని, లేకపోతే ఈ క్రాప్ నమోదు జరగదన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



తణుకులో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ సత్యవతి

తణుకు అర్బన్ : మాదకద్రవ్యాలు మానవ జీవన శైలిని చిన్నాభిన్నం చేస్తాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సర్కిల్ ఇనస్పెక్టర్ ఆర్.సత్యవతి అన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఈబీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తునిచ్చే పదార్థాల వాడకంపై బాల్యం నుంచి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాల వాడకం, తరలింపు వంటివి నేరమనే విషయాన్ని విద్యార్థులంతా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యపై ఏకాగ్రత సాధించాలని కోరారు. మాదకద్రవ్యాల తరలింపును తెలుసుకున్న విద్యార్థులు తక్షణమే ఉపాధ్యాయులకుకానీ, మా డిపార్టుమెంట్‌కి కానీ తెలియపరచాలని స్పష్టంచేశారు. కొన్ని ప్రాంతాల్లో మైనర్లు సైతం మత్తు పదార్థాలకు అలవాటుపడడం, తరలిస్తుండడం బాధాకరమన్నారు. పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎస్ఈబీ ఎస్ఐ టి.వెంకటేశ్వరరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు అక్కింశెట్టి రాంబాబు, విద్యాకమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని టూ టౌన్‌లోని జయలక్ష్మి థియేటర్ వద్ద 33/11కేవీ సౌత్ ఎస్ఎస్ పెంటపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్‌లకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను నరికేందుకు, లైన్‌ల్లో వచ్చే అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు వద్ద సమస్యలను పరిష్కరించేందుకు గాను విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. జువ్వలపాలెం, సవిత్రుపేట, కొబ్బరితోట, మెయిన్ రోడ్డు, స్థానిక ఏలూరు రోడ్డు, భాగ్యలక్ష్మిపేట, రామచంద్రరావుపేట, సీతారాంపేట, పెంటపాడు, పెంటపాడు మండలంలోని వివిధ గ్రామాలలో విద్యుత్ ఉండదని వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల

అత్తిలి: నేడు అత్తిలి మండలంలో గల పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. అత్తిలి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అత్తిలి, పాలూరు, మంచిలి, ఉరదాళ్లపాలెం, పాలి, వరిఘేడు, గుమ్మంపాడు, బల్లిపాడు, తిరుపతిపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఇరగవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం

ఇరగవరం: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిసున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతయారు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యారంగ అభివృద్ధికి జగనన్న కృషి అభినందనీయం



రావిపాడులో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెంటపాడు: విద్యారంగ అభివృద్ధికి జగనన్న కృషి అభినందనీయమని సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, రావిపాడు సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణలు పేర్కొన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఆణిముత్యాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. రావిపాడు జెడ్పీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో పదోతరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఈ సందర్భంగా ధ్రువపత్రాలతోపాటు, నగదు పురస్కారం అందించి అభినందించారు. ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచి పేరుతేవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బొచ్చెల తాతారావు, గ్రామ వైస్ ప్రెసిడెంట్ దాకే బుల్లబ్బాయి, మాజీ సర్పంచ్ వింజమూరి శ్రీనివాస్, పార్టీ నాయకులు పెన్నాడ రాఘవులు, విద్యాకమిటీ చైర్మన్ దేవ పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మీనవిల్లూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి శ్రీనివాస్, పార్టీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాసరావు, విద్యాకమిటీ నాయకులు నిల్లా నాగమల్లయ్య, సంకురాత్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



రిటైర్డ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జూనియర్ వారెంట్ ఆఫీసర్ రాజరాజేశ్వరరావును సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

తణుకు టౌన్: రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని రిటైర్డ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జూనియర్ వారెంట్ ఆఫీసర్ కడించర్ల రాజరాజేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి తణుకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరరావు మాట్లాడుతూ యుద్ధ సమయాల్లో శత్రుదేశాల విమానాల రాకపోకలు, ఉనికిని తెలిపేందుకు రాడార్ వ్యవస్థ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. రాడార్ ద్వారా విమానాల కదలికలు, ఎంత ఎత్తులో, ఎంత దూరంలో ఉన్నాయో, ఎంత సమయంలో దాడి చేయాలో అనే విషయాలను తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి జీ సుధాకర్, మల్లిన రామచంద్రరావు, నందిగం సుధాకర్, గమిని రాంబాబు, మల్లిన రాధాకృష్ణ, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం



దిరుసుమర్రు హైస్కూల్లో విద్యార్థులకు నగదు పురస్కారాలను అంజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని తలచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేలాది కోట్లు విద్యారంగానికి ఖర్చు చేస్తున్నారని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా మెరిట్ విద్యార్థులకు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గంలో నాడు-నేడు పథకం ద్వారా రూ.21 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. అలాగే కార్పొరేట్ కంటే నాణ్యమైన విద్య అందించడంతో పాటు జగనన్న విద్యా కానుక కిట్లు, జగనన్న గోరు ముద్ద ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇంగ్లీష్ మాధ్యమంతోపాటు 8, 9, 10 తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి బైజూస్ సాఫ్ట్‌వేర్ ద్వారా కార్పొరేట్ విద్యను అందిస్తున్నారన్నారు. మండలంలో మన పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రతి వార్డులో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని ఒకటో వార్డు మెంటేవారి తోటలో రూ.1.20 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెంటేవారి తోటలో వండర్ కిడ్స్ స్కూల్ నుంచి బైపాస్ రోడ్డు వరకు 380 మీటర్ల మేర సీసీ రోడ్డు, వండర్ కిడ్స్ స్కూల్ నుంచి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వరకు 250 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ రెండు రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.1.20 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, మావుళ్లమ్మ దేవస్థానం ధర్మకర్త ముత్యాల రామారావు, ముత్యాల బోసుబాబు, రామిశెట్టి జయసూర్య, ముత్యాల దొరబాబు పాల్గొన్నారు.

అందేవారి బోదె ఆక్రమణలపై త్వరలో సర్వే

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని అందేవారి బోదే ఆక్రమణపై త్వరలో సర్వే చేయిస్తామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. సర్వే పూర్తయిన తర్వాత ఆక్రమణల తొలగింపుకు రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపడతారన్నారు. ఆక్రమణదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. పార్టీ రహితంగా, పారదర్శకంగా ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతం ఆక్రమణకు గురైన విషయం ప్రజలకు తెలుసని, గత పాలకుల అండదండలు, నాయకుల ప్రోద్బలం, అధికార దాహంతో కొంతమంది ఆక్రమణలకు దిగారని పీవీఎల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉండడం వల్లే దానిలో సిల్టు పెరిగిపోయిందని, దీంతో డ్రెయిన్‌లో ప్రవాహం సరిగ్గా లేక చుట్టుపక్కల ప్రాంతాలను ముంచెత్తుతోందన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన మురుగు కాలువలు గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయని పీవీఎల్ ఎద్దేవా చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆక్రమణలను అడ్డుపెట్టుకోవడం దురదృష్టకరమన్నారు. అందేవారి బోదే, గంగానమ్మకోడు, మూలలంక పంట మురుగు కాలువల అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధుల మంజూరు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నామని పీవీఎల్ వివరించారు.